ఎండ వేడికి బైక్ దగ్ధం!

● సంగారెడ్డి పట్టణంలో ఘటన



సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 16 : ఎండవేడికి బైక్ దగ్ధమైన సంఘటన సంగారెడ్డి పట్టణంలో మంగళవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వ్యక్తి తన హోండా యాక్టివాను సంగారెడ్డి పట్టణంలోని ఫ్రైడే మార్కెట్ రోడ్డు వద్ద నిలిపాడు. కొద్దిసేపటికి బండి నుంచి అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే బైక్ పూర్తిగా దగ్ధమైంది. పాతబైక్ అవ్వడం, పెట్రోల్ లీకవ్వడంతో ఎండవేడికి మంటలు చెలరేగి బైక్ దగ్ధమై ఉంటుందని అనుమానిస్తున్నారు.

54 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

● నాలుగు వాహనాలు స్వాధీనం

అల్లాదుర్గం, ఏప్రిల్ 16 : నాలుగు వాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న 54 టన్నుల రేషన్ బియ్యం బస్తాలను పట్టుకున్నట్లు మెదక్ జిల్లా ఎస్పీ డాక్టర్ బాలస్వామి తెలిపారు. అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లోని ఓ రైస్‌మిల్లుకు వివిధ ప్రాంతాల నుంచి నాలుగు వాహనాల్లో 54 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా మంగళవారం ఉదయం గడిపెద్దాపూర్ రైస్‌మిల్లు సమీపంలో టాస్క్ ఫోర్సు పోలీసులు పట్టుకున్నట్లు ఎస్పీ తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యం విలువ రూ. 10.80 లక్షలు ఉంటుందన్నారు. డీఎస్‌వో అధికారులకు సమాచారం అందించగా డిప్యూటీ తహసీల్దార్ ప్రణీతరెడ్డి పంచనామా నిర్వహించారన్నారు. ఈ మేరకు రైస్‌మిల్లు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమంగా రేషన్‌ను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో మెదక్ డీఎస్పీ రాజేష్, అల్లాదుర్గం సీఐ రేణుక, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ బాలస్వామి







సుల్తాన్‌పూర్ వద్ద నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న కేసీఆర్

- ఏ జిల్లాలోనూ లేనంత ఎమ్మెల్యేలను గెలిపించారు
- హరీశ్‌రావు కృషితోనే అది సాధ్యమయ్యింది
- ఆగమాగం కాకుండా ఓటేయండి
- ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్

మెతుకుసీమ

రుణం తీర్చుకోలేను

మీ దీవెనలతోనే తెలంగాణ తెచ్చుకున్నాం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఏప్రిల్ 16: ఎన్ని జన్మలెత్తినా మెతుకుసీమ ప్రజల రుణం తీర్చుకోలేనని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ వద్ద మంగళవారం సాయంత్రం మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాదసభలో కేసీఆర్ ప్రసంగించారు. మెతుకుసీమ ప్రజలే తనను ఈస్థాయికి తెచ్చారని.. వారి దీవెనతోనే కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని పేర్కొన్నారు. ప్రజలిచ్చిన శక్తి వల్లే తనకు బలం చేకూరిందని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఏ జిల్లాలో రానివిధంగా మెదక్ జిల్లాలో బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీ వచ్చిందని తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని పది స్థానాల్లో ఏడు స్థానాల్లో తమను గెలిపించారని, హరీశ్‌రావు కృషితోనే అది సాధ్యమైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థులు వెంకట్రాంరెడ్డి, అనిల్‌కుమార్‌ను ఆయన ప్రజలకు పరిచయం చేశారు. మెదక్ పార్లమెంట్ నుంచి పోటీ చేస్తున్న వెంకట్రాంరెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసి ప్రజల మన్ననలు చూరగొన్నారని పేర్కొన్నారు. ఆయనకు డబ్బు అవసరం లేదని అన్నారు. జహీరాబాద్ అభ్యర్థిగా ఉన్న గాలి అనిల్‌కుమార్ 2000 సంవత్సరం నుంచి తెలంగాణ ఉద్యమంలో పని చేస్తున్నారని చెప్పారు. బలహీనవర్గాలకు చెందిన వ్యక్తి పేర్కొన్నారు. ఆగమాగం కాకుండా ఈ ఎన్నికల్లో వీరిద్దరినీ గెలిపించాలని కేసీఆర్ కోరారు.

బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్


పుల్‌కల్ : బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాదసభ బీఆర్ఎస్ కార్యకర్తల్లో జోష్ నింపింది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అందోలు, నారాయణఖేడ్, జహీరాబాద్ సెగ్మెంట్లు, మెదక్ పార్లమెంట్ పరిధిలోని సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సభ 5.30 గంటలకు ప్రారంభం కావాల్సి ఉన్నా సభా స్థలం నిండలేదు. కేసీఆర్ వచ్చే సమయానికి జనంతో కిటకిటలాడింది. ఎర్రవల్లిలోని ఫాంహౌస్ వద్ద మాజీ సెం కారుపై అక్కడి నేతలు పూల వర్షం కురిపించారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన బయలుదేరిన కేసీఆర్ శామీర్‌పేట వద్ద ఓఆర్ఆర్ ఎక్కి పటాన్‌చెరు వద్ద దిగారు. సంగారెడ్డి సమీపంలోని ఓ గార్డెన్‌లో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. రాత్రి 7.05కు కేసీఆర్ ప్రసంగాన్ని ప్రారంభించి 7.30కు ముగించారు. దాదాపు 25 నిమిషాల తన ప్రసంగంలో కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఎండగట్టారు. ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి ప్రజలను వంచించారని విమర్శించారు. అక్కరకు రాని చుట్టమని బీజేపీ తీరును ఎండగట్టారు. కేసీఆర్ ప్రసంగానికి ప్రజలు చప్పట్లతో మద్దతు తెలిపారు. సభలో మానుకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, కళాకారుడు సందీప్ నిర్వహించిన ధూంధాం ఆకట్టుకుంది. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాటల రూపంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. జహీరాబాద్, మెదక్ పార్లమెంట్ అభ్యర్థులు గాలి అనిల్‌కుమార్, బి.వెంకట్రాంరెడ్డి, జడ్పీ చైర్మన్లు పట్లోళ్ల మంజుశ్రీజైపాల్‌రెడ్డి, హేమలతశేఖర్‌గౌడ్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు తన్నీరు హరీశ్‌రావు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, సునీతారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్ రెడ్డి, పద్మారెడ్డి, సత్యనారాయణ, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, మాజీ జడ్పీ చైర్మన్ బాలయ్య, నాయకులు పట్లోళ్ల జైపాల్‌రెడ్డి, మఠం భిక్షపతి, ఎర్రోల్ల శ్రీనివాస్, పల్లె సంజీవయ్య, ప్రతాప్‌రెడ్డి, నరోత్తం, దేవీ ప్రసాద్, బుచ్చిరెడ్డి, రాజేందర్‌ముదిరాజ్, విజయ్‌కుమార్, శివకుమార్, దర్శన్‌రెడ్డి, మాణిక్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభకు వస్తున్న జనం

బోనస్ ఇస్తావా? బొంద పెట్టమంటావా?

సంగారెడ్డి టౌన్ : అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు విమర్శించారు. ప్రజా ఆశీర్వాదసభలో ఆయన ప్రసంగించారు. అధికారంలోకి రాగానే వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని మాటిచ్చి.. తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెట్టే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విసుగొచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మంచినీళ్లు, ఆసరా పెన్షన్ రావడం లేదన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ లేదని, రైతు భరోసా ఇవ్వడం లేదని, మహాలక్ష్మీ కింద రూ.2,500 పింఛన్, నిరుద్యోగభృతి, కల్యాణలక్ష్మిలో రూ.లక్షతో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని మోసం చేయారని విమర్శించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలతో అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ప్రజాపాలన అంటూ ఒక్కరోజు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉండి తర్వాత పాలనను మర్చిపోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల వెంట బడుతున్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ గెలుపును ఆపలేరన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పదేళ్లలో ఒక్క మంచి పని కూడా చేయలేదని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజీ కానీ, నర్సింగ్ కాలేజ్ కానీ ఇవ్వలేదని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్ ధరలు పెంచి పేద ప్రజల నడ్డి విరిచిందని మండిపడ్డారు. అనంతరం బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రైతు భరోసా ఇవ్వడానికి పంట సాగు చేసిన తర్వాత ఇస్తామని ఓ మంత్రి అనడం రైతులను మోసగించడమేనని విమర్శించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో 70 లక్షల మందికి రైతుబంధు ఇచ్చామని పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

మెదక్ కలెక్టరేట్‌లోనే నామినేషన్ల స్వీకరణ

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్


మెదక్, ఏప్రిల్ 16: మెదక్ లోక్‌సభ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేస్తున్నామని మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసంబంధాల అధికారి రామచందర్‌రాజుతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిర్వహణ, నిబంధనలు, ఖర్చుల రిజిస్టర్ నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అభ్యర్థులకు సహకరించడానికి నామినేషన్ కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. నామినేషన్ పత్రాలను అందజేసేందుకు, సెక్యూరిటీ డిపాజిట్ దాఖలుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయనున్నామని వివరించారు. నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి భద్రత ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు పార్టీలు, అభ్యర్థులు సహకరించాలని కోరారు.

స్వేచ్ఛగా ఓటేసేందుకు చర్యలు

లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు చేసే ప్రయత్నాలను అడ్డుకునేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. వీడియో నిఘా బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వేయలెన్స్, ఖర్చుల పర్యవేక్షణ బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని వివరించారు. సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, అభ్యర్థి స్వయంగా సంతకం చేసిన ప్రతులను కూడా రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు.



మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్



రావి ఆకులపై రాములోరు..

నారాయణఖేడ్, ఏప్రిల్ 16: శ్రీరామ నవమి పండుగను బుధవారం ఘనంగా జరుపుకోనున్న నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ రావి ఆకులపై శ్రీరాముల వారి చిత్రాలను మలిచారు. అయోధ్యలోని బాలరాముడి చిత్రం, పట్టాభిరామయ్య చిత్రాలను మలచి శ్రీరామ నవమి శుభాకాంక్షలను తెలిపారు. ఈ చిత్రాలు చూసిన వారు చిత్రకారుడు శివకుమార్‌ను అభినందిస్తున్నారు.

తూతూమంత్రంగా జడ్పీ సమావేశం

● చర్చకురాని పలు శాఖల్లోని సమస్యలు

మెదక్, ఏప్రిల్ 16 : ప్రజా ప్రతినిధులు ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉండడం.. అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో తలమునకలవడంతో జడ్పీ సమావేశాన్ని మమ అనిపించారు. మెదక్‌లోని కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో మిషన్ భగీరథ, విద్యుత్, వ్యవసాయ, పౌరసరఫరాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, పశుసంవర్థక, విద్యా శాఖలపై సభ్యులు చర్చించారు. విద్యుత్ 200 యూనిట్ల లోపు వినియోగించిన గృహ యజమానులకు సైతం బిల్లులు వస్తున్నాయని పలువురు సభ్యులు ఆరోపించారు. మన ఊరు-మన బడి పనులు పూర్తి చేసినప్పటికీ నిధులు విడుదల చేయడం లేదని ఫిర్యాదు చేశారు. వరి కోతలు జోరందుకున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనె సంచులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఉపాధిహామీ కూలీలకు వేతనాలు చెల్లించడంలో జాప్యంపై అధికారులను నిలదీశారు. రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని బ్యాంకులు వితంతు పెన్షన్ డబ్బులను ఆపుతున్నాయని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గొర్రెల యూనిట్ల కోసం డీడీలు కట్టినవారికి జీవాలైనా ఇవ్వాలి.. లేదా కట్టిన డబ్బులన్నా తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిజాంపేట మండలం చల్మెడ గ్రామ రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్, ఇంజనీర్లు నిర్లక్ష్యం వహిస్తున్నారని సభ్యుడు విజయ్‌కుమార్ ఆరోపించారు. కొల్చారం నూతన ఎంపీడీవో కార్యాలయ భవన నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభించడానికి కారణమేమిటని జడ్పీటీసీ మేఘమాల ప్రశ్నించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న చేగుంట తహసీల్దార్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శ్రీనివాస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్, అధికారులు

20 నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాలు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 16: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి క్రికెట్ వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు మెదక్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శిబిరాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ శిబిరాలు సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, జహీరాబాద్, గజ్వేల్‌లలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆన్‌లైన్ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. అండర్-14, 16, 19, 23 కేటగిరిలలో క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతుల్లో పాల్గొనేవారు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన వారై ఉండాలని తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను మే నెలలో జరిగే జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. శిబిరాలు సంగారెడ్డిలోని ఎంఎస్ అకాడమీ గ్రౌండ్స్ (జూబ్లీ క్లబ్), మెదక్‌లోని స్పోర్ట్స్ స్టేడియం, సిద్దిపేటలోని ప్రొ. జయశంకర్ మినీ స్టేడియం, జహీరాబాద్‌లోని సంఘమిత్ర, గజ్వేల్ ఐవోసీ గ్రౌండ్‌లలో నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు.

ఖేడ్‌కు చేరుకున్న ఈవీఎంలు



ప్రజాప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూంకు సీల్ వేసిన ఆర్డీవో

నారాయణఖేడ్, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో వినియోగించే ఈవీఎంలు, వీవీ ప్యాట్లు మంగళవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డి నుంచి ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సాయుధ బలగాల బందోబస్తు మధ్య నారాయణఖేడ్‌కు చేరుకున్నాయి. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తాహేర్ అలీ, పరమేశ్వర్, సాయిరాం, మోహీద్‌ఖాన్, నవాబ్, తదితరులు సమక్షంలో ఖేడ్ పట్టణ శివార్లలోని మోడల్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌లను భద్రపరిచిన ఆర్డీవో అశోకచక్రవర్తి స్ట్రాంగ్ రూంకు సీలు వేశారు.

పరీక్షలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

● నర్సాపూర్ జూనియర్ సివిల్ న్యాయాధికారి అనిత

నర్సాపూర్, ఏప్రిల్ 16: విద్యార్థుల ఫీజుల కోసం ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని నర్సాపూర్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.అనిత పేర్కొన్నారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు లీగల్ సర్వీసుకు ఫీజులు కట్టలేదని పరీక్షలు రాయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదు చేయడంతో ఆమె స్పందించి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. చదువులకు సంబంధించి విద్యార్థులకు ఎలాంటి ఆటంకం కలిగించొద్దని సూచించారు. ఇబ్బందులకు గురిచేసే విద్యాసంస్థలపై తగిన విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఎంఈవో బుచ్యానాయక్‌కు సూచించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

హత్నూర, ఏప్రిల్ 16: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దార్ ఫర్హీన్ షేక్ అన్నారు. మండల కేంద్రమైన హత్నూరలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లు ఎవరి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగులకు నిప్పంటించిన దుండగులు



కాలిపోయిన గన్నీ బ్యాగులు

నిజాంపేట, ఏప్రిల్ 16: గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉంచిన గన్నీబ్యాగులకు నిప్పంటించారు. మండల పరిధిలోని రాంపూర్‌లో వారం రోజుల క్రితం రామాయంపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కొనుగోలు కేంద్రంలో ఆవరణలో ఉంచిన గన్నీ బ్యాగులకు నిప్పంటించారు. ఈ ఘటనలో సంచులు కాలిబూడిదయ్యాయి. ఈ విషయమై నిజాంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

చిన్నారుల గ్రోత్‌రేట్ పెంపొందించాలి



అంగన్‌వాడీ టీచర్లకు గ్రోత్ మానిటరింగ్ పరికరాలను అందజేస్తున్న ఐసీడీఎస్ వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి

చేర్యాల, ఏప్రిల్ 16 : అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ గ్రోత్‌రేట్‌ను పెంపొందింపచేయాలని ఐసీడీఎస్ వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి పేర్కొన్నారు. చేర్యాల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధి లోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట, కొండపాక మండలాల్లోని 187అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేసిన గ్రోత్ మానిటరింగ్ పరికరాలను మంగళవారం పంపిణీ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో శారద ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లకు సదరు పరికరాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారుల బరువు, ఎత్తును ఎప్పటికప్పుడు పరిశీలించాలని, రోజూ కనీసం ఐదుగురు చిన్నారుల వివరాలను నమోదు చేయాలన్నారు. ఎదుగుదల లేనివారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని సరైన పోషకాహారం అందించాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సంక్షేమాధికారి సావిత్రి, పోషణ అభియాన్ బ్లాక్ కో-ఆర్డినేటర్ కనకరాజు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వ్యవసాయ బావుల పూడికతీతకు.. రైతుల ఎదురు చూపులు

● ఆరేళ్లుగా పట్టించుకోని అధికారులు
● ఈజీఎస్‌కు అనుసంధానం చేసినా ఆదుకోని పథకం

మద్దూరు, ఏప్రిల్ 16: నిరుపేద ఎస్సీ, ఎస్టీ రైతులకు చెందిన వ్యవసాయ బావుల పూడికతీతకు కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేసింది. అయితే ఆరేళ్లుగా పూడికతీత పనులపై ఈజీఎస్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో రైతులకు ఎదురుచూపులు తప్పడం లేదు. మండుటెండలతో భూగర్భజలాలు రోజురోజుకూ అడుగంటిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా ఈసారి రైతులు అధికంగా వరి సాగుచేశారు.

పనులకు అనుమతులు ఇలా..

నిరుపేద రైతులకు చెందిన వ్యవసాయ బావుల పూడికతీత పనులను ఉపాధిహామీ కూలీలతో చేయిస్తారు. క్రేన్ సహాయంతో పూడిక తీత మట్టిని బయటకు తీసేందుకు అనుమతి ఇవ్వడంతోపాటు ఒక్కో బావిలో తీసే పూడికతీతకు సుమారు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తుంది. ఆసక్తి గల రైతులు భూమి పట్టా పాసుపుస్తకం, ఆధార్‌కార్డ్ జిరాక్స్ ప్రతులతో ఫీల్డ్ అసిస్టెంట్‌కు దరఖాస్తు చేసుకోవాలి. వాటిని టెక్నికల్ అసిస్టెంట్‌తో కలిసి పరిశీలించి ఒక్కో బావి పూడికతీతకు ఎంత ఖర్చవుతుందో ప్రతిపాదనలు తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. దరఖాస్తులు సక్రమంగా ఉంటే 15 రోజుల్లో పూడికతీత పనులకు అనుమతులు లభిస్తాయి. 16 గజాల లోతు వరకు తవ్వుకునేందుకు అనుమతులున్నాయి. బావుల్లో 196 క్యూబిక్ మీటర్ల తీసినందుకు ఒక్కో కూలీకి రూ.113.96, గట్టి దరికైతే 49 క్యూబిక్ మీటర్లకు రూ.218.25లు చెల్లించేది. క్రేన్ సహాయంతో 245 క్యూబిక్ మీటర్ల మట్టిని తీసినందుకు రూ.70లు అందిస్తుండగా ఆయిల్ ఇంజన్‌కు రూ.70లుగా నిర్ణయించారు. ప్రస్తుతం కూలీ రేట్లు పెరగడంతో ధరల వ్యత్యాసంలో భారీగా తేడా ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.



లద్నూరులో పూడికతీత లేక వృథాగా ఉన్న వ్యవసాయ బావి

ఆరేళ్లుగా అనుమతులకు దూరం

2018 నుంచి ఇప్పటివరకు పూడికతీత పనులపై అనుమతులు లేకుండాపోయాయి. గతంలో మండలంలో సుమారు 120 మంది రైతులకు పైగా దరఖాస్తు చేసుకోగా.. కేవలం 9 మంది రైతులకు మాత్రమే అనుమతులు వచ్చాయి. అందులోనూ డబ్బు చెల్లింపులో తీవ్ర అన్యాయం చోటు చేసుకున్న బాధిత రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందనే ఆరోపణలున్నాయి. ఎస్సీలు 4,827మంది, ఎస్టీలు 1,924 మంది జాబ్‌కార్డు కలిగి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

కొత్త బావులకు అనుమతులు



కొత్త బావుల తవ్వకాలకు అనుమతులున్నాయి. జియాలజిస్టు ద్వారా తీసుకున్న సర్టిఫికెట్‌తో స్థానిక పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాలి. 12 నుంచి 16 మీటర్ల లోతు తవ్వుకునే అవకాశం ఉన్నది. ఇందుకుగానూ ప్రభుత్వం రూ.1.80 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేయనున్నది. దరఖాస్తులను పరిశీలించి ఎస్టిమేషన్ వేసి పంపిస్తాం. ఆసక్తి గల రైతులు దరఖాస్తులు చేసుకోవాలి.

- పరశురాములు, ఉపాధిహామీ ఈసీ, మద్దూరు

పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

● రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన దాస్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందనదాస్, పాల్గొన్న సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 16: నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని రిటర్నింగ్ అధికారి, నల్గొండ కలెక్టర్ హరిచందన దాస్ ఆయా జిల్లాల ఎన్నికల అధికారులకు సూచించారు. మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలకు సరిపడినన్ని బ్యాలెట్ బాక్సులు అందుబాటులో ఉండేలా, పోలింగ్ కేంద్రాల్లో ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను అత్యంత పకడ్బందీగా స్ట్రాంగ్ రూంకు చేరవేసేలా రూట్ మ్యాప్ సిద్ధం చేసుకుని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మను చౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్షన్ డీటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'కుష్ఠు' నిర్మూలనకు కృషి చేయాలి



డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో కుష్ఠువ్యాధి నిర్మూలనపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ప్రోగాం అధికారి డాక్టర్ శ్రీదేవి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 16: కుష్ఠువ్యాధి నిర్మూలనకు వైద్యశాఖ సిబ్బంది సమన్వయంతో కృషిచేయాలని ప్రోగాం అధికారి డాక్టర్ శ్రీదేవి సూచించారు. మంగళవారం సిద్దిపేటలో డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీదేవి అధ్యక్షతన కుష్ఠువ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న నోడల్ సిబ్బంది, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, నిక్ష్యాస్ యాప్‌లో కుష్ఠు వ్యాధిగ్రస్థుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. కుష్ఠువ్యాధి కార్యక్రమంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య తగ్గిపోవడంతో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆరోగ్య కార్యకర్తలకు డాటాఎంట్రీ ఆపరేటర్లకు, సూపర్‌వైజర్లకు వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా పూర్తిగా కుష్ఠువ్యాధి నిర్మూలనలో యాప్ ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. నమోదు చేసిన సంఖ్య ద్వారా కొత్తగా కుష్ఠు వ్యాధిగ్రస్థులు జిల్లాలో ఎంతమంది నమోదవుతున్నారో తెలుసుకోవచ్చని, అందుకు అనుగుణంగా మందులను సరఫరా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో శిక్షకులు రాష్ట్ర లెప్రసీ సొసైటీ సభ్యుడు కామేశ్వరరావు, నరసింహస్వామి, డీపీఎంవోలు, ఎన్ఎల్ఈపీ సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య రాముడిని దర్శించుకున్న రఘునందన్‌రావు



అయోధ్యలోని రాంలల్లా సన్నిధిలో రఘునందన్‌రావు

దుబ్బాక, ఏప్రిల్ 16: మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు మంగళవారం అయోధ్య రామ మందిరంలోని బాల రాముడి సన్నిధిలో నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు చేశారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ నెల 18న నామినేషన్‌ను దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

రేపు నామినేషన్

మెదక్ అర్బన్, ఏప్రిల్ 16: మెదక్ లోక్‌సభ స్థానానికి గురువారం బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి బస్వ లక్ష్మీనర్సయ్య తెలిపారు. పట్టణంలో 30 వేల మందితో ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌లో నామినేషన్ వేస్తారని వెల్లడించారు. కార్యక్రమానికి గోవా సీఎం ప్రమోద్ పాండురంగ్ సావంత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హాజరుకానున్నట్లు ఆయన వెల్లడించారు.

కోలపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.2లక్షలు పట్టివేత



నగదు స్వాధీన పత్రాన్ని ఇస్తున్న ఎస్ఐ

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 16: మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండల పరిధిలోని 161వ జాతీయ రహదారిపై కోలపల్లి చెక్‌పోస్టు వద్ద మంగళవారం పేట ఎస్ఐ శంకర్ రూ. 2లక్షల నగదును పట్టుకున్నారు. మహారాష్ట్ర నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న షేక్ సమీర్ వాహనంలో ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా రూ.2 లక్షలను తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ డబ్బులను సంగారెడ్డి గ్రీవెన్స్ కమిటీలో డిపాజిట్ చేయనున్నట్లు తెలిపారు.

కుటుంబ తగాదాలతో సొంతింటికే నిప్పంటించిన ఘనుడు

● రూ.5 లక్షల ఆస్తి నష్టం ● నారాయణరావుపేటలో ఘటన



కాలిపోతున్న ఇల్లు

నారాయణరావుపేట, ఏప్రిల్ 16: కుటుంబ తగదాలతో ఓ వ్యక్తి సొంత ఇంటికే నిప్పంటించిన సంఘటన సోమవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. గ్రామస్థులు, సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావుపేటకు చెందిన పొన్నవేణి నర్సింహులుకు వివాహం అయిన కొంత కాలానికి ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాడు. నాటి నుంచి తన భార్య బాగోగులు కూడా చూడలేదు. అక్కడ సంపాదించిన డబ్బులను తల్లిదండ్రులకు పంపించేవాడు. భార్య బీడీలు చేసుకుంటూ పిల్లలను పోషించుకునేది. స్వగ్రామానికి తిరిగి వచ్చాక కుటుంబాన్ని పట్టించుకోకపోగా శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేసేవాడు. కుల పెద్ద సమక్షంలో పంచాయితీలు పెట్టినా తీరు మారలేదు. సోమవారం నర్సింహులు తన తల్లిదండ్రులతో డబ్బుల విషయంలో గొడవ పడ్డాడు. నా డబ్బులు నాకు ఇవ్వకపోతే ఇంటిని తగలబెడతానని బెదిరించగా, నీ ఇష్టం.. ఏం చేసుకుంటావో చేసుకో అని వారు బదులిచ్చారు. నర్సింహులు కోపం పట్టలేక భార్య, పిల్లలను కొట్టడంతో వారు భయంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయారు. అదే కోపంలో విచక్షణ కోల్పోయి వాహనంలోని పెట్రోల్‌ను ఇంట్లో వస్తువులపై చల్లి నిప్పంటించాడు. మంటలతో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్, ఫ్రిజ్, ఇతర విలువైన సామగ్రితో పాటు మొత్తం కాలిపోయాయి. ఈ సమాచారమందుకున్న సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి ఫైర్ ఇంజన్ సిబ్బందిని రప్పించి మరిన్ని నివాసాలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. నర్సింహులు భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపారు.

కోళ్ల లోడ్ వ్యాన్ బోల్తా.. 300 కోళ్లు మృతి.. రూ. లక్ష నష్టం

● రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతోనే ఘటన



మృతి చెందిన కోళ్లు

రామాయంపేట, ఏప్రిల్ 16: రోడ్లపై వరిధాన్యం ఆరబోయటం రోడ్డు ప్రమాదాలకు దారి తీస్తున్నది. రామాయంపేట శివారు పాత హైవేపై కోళ్ల లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం మంగళవారం బోల్తా పడింది. ఈ ఘటనలో సుమారు 300 కోళ్లు చనిపోగా రూ. లక్ష వరకు నష్టం వాటిల్లింది. రోడ్డుపై ఒక వైపున వరిధాన్యం ఆరబోయడం వల్ల వాహనం అదుపుతప్పి ఈ ప్రమాదం చోటు చేసుకోగా, డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కాగా ఇటీవలే ఝాన్సీ లింగాపూర్ వద్ద ఓ బైక్ వరికుప్పను ఢీకొన్న ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ మృతి చెందిన విషయం విదితమే. రెండు రోజుల క్రితం ఇదే విధంగా బైక్ అదుపు తప్పిన ఘటనలో మరొకరు గాయపడ్డారు. ఇలా తరచూ వాహనదారుల ప్రాణాల మీదకు వచ్చినా పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇకనైనా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేవ చేసే అవకాశం ఇవ్వండి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

చేగుంట, ఏప్రిల్ 16: మెదక్ జిల్లా మొదటిసారిగా ఓ ఉన్నతాధికారిగా తనకు మంచి అవకాశం ఇచ్చిందని, రెండోసారి మెదక్ ఎంపీగా ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల పరిధిలోని వడియారంలో ఓ ఫంక్షన్‌హాలులో పార్టీ అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి అధ్యక్షతన చేగుంట, నర్సింగ్ మండలాల పార్లమెంట్ ఎన్నికల ముఖ్య కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మెదక్ జిల్లాలో 11సంవత్సరాల పాటు పని చేసిన అనుభవం ఉందని, తనను ఎంపీగా గెలిపిస్తే కేంద్రంలో ఉన్నతాధికారుల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తాను కలెక్టర్‌గా ఉన్న రోజుల్లో సిద్దిపేట, గజ్వేల్ అభివృద్ధికి ఎంతో కృషి చేశానన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే రూ.100 కోట్లతో పీవీఆర్ ట్రస్టు, విద్యానిధి ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఓటమి భయంతో ప్రత్యర్థులు తనపై దుష్ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం వెంకట్రామారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డిలను కార్యకర్తలు శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మనోహర్‌రావు, వెంకట నరసింహారెడ్డి, సతీష్‌రెడ్డి, రాజిరెడ్డి, జడ్పీటీసీలు మోదం శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ఎంపీపీ చిందం సబిత, నార్సింగ్ మండల అధ్యక్షుడు మైలారం బాబు, సొసైటీ వైస్ చైర్మన్ పట్నం తానేష, మాజీ సర్పంచ్ శ్రీనివాస్. రాజ గోపాల్, నాయకులు పాల్గొన్నారు.

బాబోయ్ ఎండలు..

● బెంబేలెత్తుతున్న జనం ● ఎయిర్ కూలర్లు, శీతల పానీయాలకు డిమాండ్



చేర్యాలలో నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి

చేర్యాల. ఏప్రిల్ 16: ఎండలు మండుతున్నాయి. భగభగమండే సూర్యుడి ప్రతాపానికి జనం బెంబేలెత్తుతున్నారు. బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి. పనులకోసం బయటకు వెళ్లేవారు ఉక్కపోత, చెమటతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనులకు, ఇతర కూలీపనులకు వెళ్లేవారి పరిస్థితి మరీ దారుణంగా మారింది. మధ్యాహ్నం వేళల్లో నిప్పుల కొలిమిలా మండుతుండటంతో బయటకు ఎవరూ రాకపోవడం వలన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటికి వస్తున్నవారు ఎండ తాకిడి నుంచి తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. కొందరు టోపీలు, టవళ్లు, స్కార్ఫ్‌లు ధరిస్తుండగా, మరికొందరు గొడుగులు ఉపయోగిస్తున్నారు. ఎన్నిసార్లు నీరు తాగినా దాహం తీరక శీతలపానీయాల కోసం పరుగులు పెడుతున్నారు. దీంతో పట్టణంలో శీతల పానీయాలు, ఫ్రూట్‌జ్యూస్ సెంటర్లు వెలిశాయి. ఆరోగ్యకరమైన కొబ్బరి బొండాలు, చెరుకు రసాన్ని సేవిస్తూ సేదతీరుతున్నారు. ఎండవేడిని తట్టుకునేందుకు ఫ్రిజ్‌లు, కూలర్లు కొనుగోలు చేస్తుండటంతో వాటికి డిమాండ్ పెరిగింది. ఎండవేడికి పశువులు అల్లాడుతున్నాయి.



వేడికి తాళలేని ఆవుకు నీరు పడుతున్న రైతు



విక్రయాల కోసం తరలిస్తున్న కూలర్లు



తలకు గొడుగుతో బైక్‌పై వెళ్తున్న యువకులు

డిహైడ్రేషన్ కాకుండా జాగ్రత్తపడాలి

ఇప్పటికే ఎండలు విపరీతంగా ఉన్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి. శరీరం డిహైడ్రేషన్‌కు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి. సురక్షిత తాగునీరు, కొబ్బరి బొండాలు, ఓఆర్ఎస్ సేవించాలి. జంక్‌ఫుడ్‌ను విస్మరించాలి. చిన్నారులను ఎండ సమయంలో అసలు బయటకు తీసుకురాకూడదు.

- తుంగ రఘునందన్ రాణా, చిన్నపిల్లల వైద్యుడు



గుమ్మడిదలలో బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన పురాతన శ్రీరామాలయం



అల్లాదుర్గం మండలం రాంపూర్‌లోని పెద్దమ్మతల్లిని దర్శించుకున్న త్రిష దంపతులు



విగ్రహాల ప్రతిష్ఠాపనలో భాగంగా యజ్ఞం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

శ్రీరామ నవమికి ఆలయాల ముస్తాబు

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- నేటి నుంచి గుమ్మడిదలలో సీతారామచంద్రస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు

గుమ్మడిదల, ఏప్రిల్ 16: శ్రీరామ నవమిని పురస్కరించుకుని గుమ్మడిదల మండలంలోని కల్యాణ సీతారామచంద్ర ఆలయంలో ఈ నెల 17 నుంచి 20 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. వంశపార్యం ధర్మకర్తలు ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇప్పటికే ఆలయాన్ని రంగులతో తీర్చిదిద్దారు. 17న మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారికి శేష వాహన సేవ, ఎదుర్కోలు, అనంతరం కల్యాణోత్సవం ఉంటుంది. సాయంత్రం గజవాహన సేవ, 18న గరుడ వాహన సేవ, 19న హనుమంతు వాహన సేవ, 20న తెల్లవారుజామున విమాన రథోత్సవం ఉంటుందని తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పడమటి లక్ష్మారెడ్డి తెలిపారు.

నేడు తూప్రాన్‌లో సీతారాముల కల్యాణం

తూప్రాన్, ఏప్రిల్ 16: తూప్రాన్ పట్టణ శివారులోని పురాతన శ్రీరామాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం శ్రీరామ నవమి సందర్భంగా ఆలయం వద్ద స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారరు. ఆలయం చుట్టూ చలువ పందిళ్లు వేస్తున్నారు. ఆలయం వద్దకు వెళ్లే రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను మున్సిపల్ సిబ్బంది పూడ్చివేస్తున్నారు.

కల్యాణోత్సవాలకు ముస్తాబు

జిన్నారం, ఏప్రిల్ 16: జిన్నారం మండలవ్యాప్తంగా శ్రీరామ నవమి కోసం ఏర్పాట్లను పూర్తి చేశారు. మండల కేంద్రం జిన్నారం, మాధారం, బొల్లారం, మంగంపేట తదితర గ్రామాల్లోని ఆలయాల వద్ద సీతారాముల కల్యాణోత్సవాల కోసం సుందరంగా అలంకరించారు. ఆయా ఆలయాల కమిటీలు, ప్రజా ప్రతినిధులు, భక్తుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు.

సీతారామాంజనేయస్వామి ఆలయంలో..

మాసాయిపేట, ఏప్రిల్ 16: శ్రీరామ నవమి సందర్భంగా మాసాయిపేట మండలంలోని హల్దీ నదికి అనుకుని కొలువైన పురాతన బొమ్మారం సీతారామాంజనేయస్వామి ఆలయాన్ని ముస్తాబుచేశారు. 30 గ్రామాల ప్రజలు ఇక్కడికి వచ్చి స్వామివారికి పూజలు నిర్వహించి, కల్యాణంలో పాల్గొంటారు.

ఘనంగా రామయ్య హంస వాహన సేవ

నారాయణఖేడ్, ఏప్రిల్ 16: ఖేడ్ పట్టణంలోని చరిత్రాత్మక సీతారామచంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నాలుగోరోజు మంగళవారం కొనసాగాయి. హంస వాహన సేవ, జ్ఞానేశ్వర్ మహరాజ్‌చే కీర్తన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వాహనాన్ని రామాలయం నుంచి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. కాలనీల్లో భక్తులు రాములోరిని దర్శించుకున్నారు.

రావి ఆకుపై శ్రీరామచంద్రుడి చిత్రలేఖనం

మనోహరాబాద్, ఏప్రిల్ 16: శ్రీరామ నవమి సందర్భంగా రావి ఆకుపై శ్రీరాముడి చిత్రాన్ని మనోహరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు బ్రహ్మచారి గీశాడు. ప్రతి పండుగకు చిత్రాలు గీస్తానని చెప్పారు.

సీతారామ, లక్ష్మణుడి చిత్రం గీసిన బాలుడు

కల్హేర్, ఏప్రిల్ 16: శ్రీరామ నవమి సందర్భంగా మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన బూరంశెట్టి సౌమిత్ పెన్సిల్‌తో సీతారామ, లక్ష్మణుడి చిత్రాలను అందంగా గీశాడు. చిన్న తనంలోనే అద్భుత కళతో రాణిస్తున్న సౌమిత్‌నే పలువురు అభినందించారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా బోనాలు

అల్లాదుర్గం, ఏప్రిల్ 16: అల్లాదుర్గం మండలం రాంపూర్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయంలో భక్తులు మంగళవారం బోనాలు నిర్వహించారు. గ్రామంలోని భక్తులే కాకుండా సమీపంలోని కాయిదంపల్లి, సీతానగర్ తదితర గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఈ వేడుకలకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కుమార్తె త్రిష దంపతులు హాజరయ్యారు. వారికి ఆలయ కమిటీ నిర్వాహకులు స్వాగతం పలికారు.

సిద్ధేశ్వరాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన

జహీరాబాద్, ఏప్రిల్ 16: జహీరాబాద్ పట్టణంలోని సిద్ధేశ్వరాలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన ప్రారంభమైంది. మొదటిరోజైన మంగళవారం ఆలయ ఆవరణలో గోపూజ, అగ్రోదకం, మత్స్యంగ్రహణం, ధ్వజారోహణం, వాస్తుబలి, రక్షోఘ్నపూజ, యాగశాల, ఆలయ ప్రవేశం, మహా గణపతిపూజ ఆఖండ దీపారాధన తదితర పూజలు నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన 18 వరకు కొనసాగనున్నదని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

మంజీరానదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం



లభ్యమైన గుర్తు తెలియని మృతదేహం

కొల్చారం, ఏప్రిల్ 16: కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి శివారులోని మంజీరా నదిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. ఎస్‌ఐ మహ్మద్‌గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతంశెట్‌పల్లి శివారులోని దుర్గా వైన్స్ సమీపంలోని మంజీరా నదిలో మొదటి బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు చూసిన వ్యక్తి సమాచారం మేరకు గజ ఈతగాళ్లతో మృతదేహాన్ని బయటకు తీశామన్నారు. మృతుడి వయస్సు 26-28 ఏళ్లు ఉంటుందని, కుడిచేతిపై స్టార్ ట్రైబ్ పచ్చబొట్టు ఉన్నదని తెలిపారు. ఎవరికైనా వివరాలు తెలిస్తే 8712657919 కొల్చారం ఎస్‌ఐ లేదా 8712657916 మెదక్ రూరల్ సీఐని సంప్రదించాలన్నారు.

తంపులూర్‌లో యువతి అదృశ్యం



సుమలత (ఫైల్)

టేక్మాల్, ఏప్రిల్ 16: యవతి అదృశ్యమైన సంఘటన టేక్మాల్ మండలం తంపులూర్‌లో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన నాయికోటి సాయిలుకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా ఈ నెల 15న గ్రామంలో దుర్గమ్మ జాతరలో భాగంగా నిర్వహిస్తున్న వీధి నాటకం చూసేందుకు భార్య చిన్న కూతురు వెళ్లారు. పెద్ద కూతురు సుమలత ఇంటి వద్దనే ఉన్నది. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి సుమలత కనిపించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో తండ్రి సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.

అంగన్‌వాడీ పిల్లలకు మెడల్స్

కొండాపూర్, ఏప్రిల్ 16: హరిదాస్‌పూర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం యాన్యువల్‌డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లలు పూర్వ ప్రాథమిక విద్య స్థాయిలో సాధించిన ఘనతను చాటి చెప్పేందుకు అబ్జర్వేషన్ బుక్స్, అసిస్టెంట్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. అనంతరం చిన్నారులకు మెడల్స్ వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్యామల, అసిస్టెంట్ అనిత, టీచర్ ఏసుమణి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తారా కళాశాలలో మెగా రక్తదాన శిబిరం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 16: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగాలు, అర్థ శాస్త్ర విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైనట్లు ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు అపోహలు వీడి రక్తదానం చేసి పది మంది ప్రాణాలు కాపాడాలని సూచించారు. కాగా 38 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, డా.వెంకటేశం, బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ రాజు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మార్పీఎస్‌పై సీఎం వ్యాఖ్యలు అర్థరహితం'

మాసాయిపేట, ఏప్రిల్ 16: మాదిగ జాతి పట్ల సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర వివక్ష చూపుతున్నారని, ఎమ్మార్పీఎస్‌పై సీఎం చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మాసాయిపేట మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాదిగలకు రావాల్సిన మూడు పార్లమెంట్ స్థానాలకుగానూ ఒక్క సీటు కూడా కాంగ్రెస్ కేటాయించకపోగా.. కల్లబొల్లి మాటలతో మాదిగలను మభ్యపెట్టాలని చూస్తున్నారని అన్నారు. రేవంత్ జైల్లో ఉన్నప్పుడు తమ నాయకుడు మందకృష్ణ మాదిగ కాంగ్రెస్‌కు మద్దతిచ్చాడని, సీఎం ఇప్పటికైనా నిజం గ్రహించి మాదిగ జాతికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు మాసాయిపేట యాదగిరిమాదిగ, చెట్లపల్లి యాదగిరిమాదిగ, చందు శ్రీనివాస్‌మాదిగ, శంకర్ మాదిగ, మహిళా నాయకురాలు పుష్పమాదిగ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమన్వయకర్తలు వీరే

మెదక్/సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 16: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మెదక్ లోక్‌సభకు సంబంధించి నియోజకవర్గ సమన్వయకర్తలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియమించారు. మెదక్ నియోజకవర్గానికి డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గానికి ఎర్రోళ్ల శ్రీనివాస్, పటాన్‌చెరు నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్సీ భూపాల్‌రెడ్డి, నర్సాపూర్ నియోజకవర్గానికి ఎమ్మెల్సీ యాదవరెడ్డి, దుబ్బాక నియోజకవర్గానికి మనోహర్‌రెడ్డి, గజ్వేల్ నియోజకవర్గానికి జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సిద్దిపేట నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్‌లను నియమించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జహీరాబాద్ పార్లమెంట్‌లో పరిధికి సంబంధించి జహీరాబాద్ నియోజకవర్గానికి టీజీఎస్ బేవరేజెస్ మాజీ చైర్మన్ దేవిశ్రీ ప్రసాద్‌రావు, అందోల్‌కు డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, నారాయణఖేడ్‌కు టీఎస్‌టీపీసీ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి, కామారెడ్డికి మాజీ ఎమ్మెల్యే జనార్ధన్‌గౌడ్, ఎల్లారెడ్డికి తిరుమల్‌రెడ్డి, బాన్సువాడకు జడ్పీ చైర్మన్ దఫేదర్ రాజు, జుక్కల్‌కు మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలను నియమించారు.

బీఆర్‌ఎస్ పట్టణ కన్వీనర్‌గా ఆంజనేయులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 16: బీఆర్‌ఎస్ మెదక్ పట్టణ నూతన కన్వీనర్‌గా కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులును నియమించారు. మంగళవారం సాయంత్రం జిల్లా పార్టీ కార్యాలయంలో అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పట్టణ కమిటీని ప్రకటించారు. 5వ వార్డు కౌన్సిలర్‌గా కొనసాగుతున్న మామిళ్ల ఆంజనేయులు కన్వీనర్‌గా, కో-కన్వీనర్లుగా గడ్డమీది కృష్ణాగౌడ్, లింగారెడ్డి, జుబేర్ అహ్మద్, కండెల సాయిలును నియమించారు. అనంతరం పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో వెంకట్రామారెడ్డి గెలుపునకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇఫ్కో డైరెక్టర్, రాష్ట్ర కార్యదర్శి దేవేందర్‌రెడ్డి నూతన కమిటీ సభ్యులకు సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రఘునందన్‌రావు గెలుపే లక్ష్యం

సంగారెడ్డి అర్బన్/మనోహరాబాద్, ఏప్రిల్ 16: మెదక్ ఎంపీగా రఘునందన్‌రావు గెలుపే లక్ష్యమని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి అన్నారు. సంగారెడ్డి మండలం చింతల్‌పల్లితో పాటు పట్టణంలోని పలు వార్డుల్లో ఆమె బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌కు మద్దతుగా మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు అందజేస్తూ, మూడోసారి ప్రధానిగా మోదీని చేయాలని సూచించారు. ఆమె వెంట జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనర్సింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి డా.రాజుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, పట్టణ అధ్యక్షుడు ద్వారక రవి ఉన్నారు. మనోహరాబాద్‌లో బీజేపీ మండల స్థాయి సమావేశం అధ్యక్షుడు నరేందర్‌చారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల ఇన్‌చార్జి రమేష్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. రఘునందన్‌రావు గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

స్వార్థపరులే పార్టీని వీడారు.. పార్టీకి ఎటువంటి నష్టం లేదు

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి



నర్సాపూర్ నుంచి కేసీఆర్ సభకు జెండా ఊపి తరలివెళ్తున్న ఎమ్మెల్యే సునితారెడ్డి, తదితరులు

నర్సాపూర్, ఏప్రిల్ 16: మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్‌ను వీడిన వారు వారి స్వార్థం కోసమే వెళ్లారని, వారివల్ల పార్టీకి ఎలాంటి నష్టం లేదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి ఒకరిద్దరు నాయకులు మదన్‌రెడ్డి వెంట వెళ్లారు తప్పా కార్యకర్తలు పార్టీని వీడలేదన్నారు. పోయిన వారు పార్టీ కోసం ఏనాడూ పనిచేయలేదని, వారిలో ఎక్కువ మందిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో డిసెంబరు 9న ఇచ్చిన హామీలపై సంతకాలు చేస్తానని గొప్పలు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కాలయాపన చేస్తూ ఇప్పుడు ఈ ఎన్నికల్లో లబ్ధిపొందడానికి ఆగస్టులోపు పథకాలు అమలు చేస్తానంటూ ప్రజలను మరోసారి మోసం చేయడానికి చూస్తున్నారని అన్నారు. అందోల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన మాజీ సీఎం కేసీఆర్ సభకు నియోజకవర్గం నుంచి ఊహించిన దానికంటే ఎక్కువ మంది స్వచ్ఛందంగా తరలివస్తున్నారని సునీతారెడ్డి తెలిపారు. కేసీఆర్ సభకు నర్సాపూర్‌లో సునితారెడ్డి జెండా ఊపి తరలివెళ్లారు. వెళ్లిన వారిలో లేబర్ వెల్ఫేర్ మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, నాయకులు ఉన్నారు.

తేమశాతం నిబంధనల మేరకు ఉంటేనే కొనుగోలు చేయండి

- మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



చిప్పల్‌తుర్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, ఆర్డీవో తదితరులు

నర్సాపూర్, ఏప్రిల్ 16: తేమశాతం నిబంధనల మేరకు ఉంటేనే కొనుగోలు చేయాలని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈనెల 15న 'కేంద్రాల వద్ద ధాన్యంతో రైతుల పడిగాపులు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మంగళవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తదితరులు నర్సాపూర్, చిప్పల్‌తుర్తి కొనుగోలు కేంద్రాలను సందర్శించి కేంద్రాల వద్ద ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలన్నారు. నిబంధనల మేరకు 16 శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది కలిగించొద్దని నిర్వాహకులకు సూచించారు. వారివెంట తహసీల్దార్ కమలాద్రి, ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

నారాయణఖేడ్‌లో బీబీపాటిల్ రోడ్ షో

- టీ అందిస్తూ ఓట్లు అడిగిన బీబీపాటిల్



ఖేడ్‌లోని టీపాయింట్‌లో టీ అందిస్తూ ఓట్లు అడుగుతున్న బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట/టేక్మాల్, ఏప్రిల్ 16: నారాయణఖేడ్‌లో మంగళవారం బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి బీబీపాటిల్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మంగల్‌పేటలోని బీజేపీ కార్యాలయం నుంచి రాజీవ్ చౌక్ వరకు పాదయాత్ర చేసి, రాంవిలాస్ వీధిలో వ్యాపారుల వద్దకెళ్లి బీజేపీకి ఓట్లు వేసి తనను గెలిపించాలని కోరారు. రోడ్‌లో భాగంగా రోడ్డు పక్కన ఉన్న టీ పాయింట్‌లో టీ అందిస్తూ బీజేపీకి ఓట్లు వేయాలని ఆయన కోరారు. కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేయడమే కాకుండా, బీజేపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు, వ్యాపారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే విజయపాల్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్, బీజేపీ గిరిజన మోర్చా జాతీయ నాయకులు అమర్‌సింగ్, బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి సంగప్ప పాల్గొన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను గెలిపించాలని కోరుతూ మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో మంగళవారం బీజేపీ మండలాధ్యక్షుడు కోణం విఠల్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టేక్మాల్ మండలం హెచ్‌ఎంపల్లి 71వ బూత్‌కు చెందిన పలువురు గ్రామస్థులు బీబీ పాటిల్ సమక్షంలో మంగళవారం బీజేపీలో చేరారు.

కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు: ఆర్డీవో

తూప్రాన్, ఏప్రిల్ 16: యాసంగి ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి సూచించారు. మంగళవారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులతో సమావేశం నిర్వహించారు. కొనుగోలు చేసిన 24 గంటల్లోనే డాటా ఎంట్రీ చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లలో వేగం పెంచి 15 రోజుల్లో పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఐకేపీ ఏపీఎం రుక్మిణి, రెవెన్యూ సిబ్బంది, ఐకేపీ, సొసైటీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


కంది/పెద్దశంకరంపేట/ ఏప్రిల్ 16: మండల కేంద్రమైన కందిలోని అక్షయపాత్రలో మంగళవారం సంగారెడ్డి ఫైర్ సేఫ్టీ అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రతకు ఎక్కుగా అగ్నిప్రమాదలు జరుగుతాయన్నారు. అగ్ని మాపక యంత్రాల వినియోగంపై అందరికి అవగాహన అవసరం అన్నారు. అగ్ని ప్రమాదం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఫైర్ సేఫ్టీ అధికారులు నాటక రూపంలో ప్రదర్శించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఫైర్ సేఫ్టీ సిబ్బంది, అక్షయపాత్ర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పెద్దశంకరంపేటలోని ప్రియాంక కాలనీలో అగ్ని ప్రమాదాలకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పెద్దశంకరంపేటస్టేషన్ ఫైర్ అధికారి శ్రీశైలం ఆధ్వర్యంలో సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది రాజ వెంకటరెడ్డి, రమేష్, రాజశేఖర్, సాయికిరణ్, గోపాల్, రాజేందర్, ఇబ్రహీం పాల్గొన్నారు.

ఉద్యమాలకు కార్మికులు సంఘీభావ నిధి అందించడం అభినందనీయం

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 16: సామాజిక ఉద్యమాలకు కార్మికులు సంఘీభావ నిధి అందించడం అభినందనీయమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లాలో కార్మికుల నుంచి సేకరించిన రూ.1,61,547లకు సంబంధించిన చెక్కును హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ పాలకులు దళిత, బహుజన, మైనార్టీల సమస్యలను పరిష్కరించకుండా వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని విమర్శించారు. దేశంలో నేటికి కుల వివక్ష, అంటరానితనం, పేదరికం లాంటి సమస్యలు ఇంకా తీవ్రంగా ఉన్నాయన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య, మల్లికార్జున్, జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఉపాధ్యక్షుడు రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురు నాయకుల చేరిక



కల్హేర్: మహదేవ్‌పల్లిలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

కొల్చారం/రాయికోడ్/మాసాయిపేట/కల్హేర్/గుమ్మడిదల, ఏప్రిల్ 16: కొల్చారం మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సారథ్యంలో గాంధీభవన్‌లో ఏఐసీసీ జాతీయ కార్యదర్శి, తెలంగాణ సహాయ ఇన్‌చార్జి రోహిత్‌చౌదరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కొల్చారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అల్లు మల్లారెడ్డి, కొల్చారం ఎంపీటీసీ పాల్వంచ అరుణక్రిష్ణాగౌడ్, ఎనగండ్ల, రంగంపేట, పోతంశెట్‌పల్లి తాజా మాజీ సర్పంచులు వీరారెడ్డి, బండి సుజాతరమేష్, నాగరాణినర్సింహులు, పోచయ్య, మెదక్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సావిత్రిరెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పెంటారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ఎల్లుగారి శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, నవాజ్‌రెడ్డి, సంజీవరెడ్డి, పైతర మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, రాంపూర్ గోవర్ధన్‌రెడ్డి, గౌడ సంఘం మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్, ధన్‌రాజ్, రంగంపేట రవిందర్‌గౌడ్, దుర్గేష్‌గౌడ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరినవారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మెదక్ అభ్యర్థి నీలం మధు, కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అంజనేయిలుగౌడ్, సుహాసినిరెడ్డి, శేషసాయిరెడ్డి, మీడియా కోఆర్డినేషన్ అజయ్ మారుతీరావు, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాయికోడ్ మండల పరిధిలో సింగితం గ్రామానికి చెందిన మైనార్టీ జిల్లా నాయకుడు మహ్మద్ సుల్తాన్, తన అనుచరులతో మంగళవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర్ రాజనర్సింహ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి సురేష్‌కుమార్ షెట్కార్, కాంగ్రెస్ మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. మాసాయిపేట మండలంలోని రామంతపూర్ సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి, తండా సర్పంచ్ గోపీనాయక్, మాసాయిపేట మాజీ ఉపసర్పంచ్ సిద్ధిరాములుగౌడ్, పలువురు ఎంపీటీసీలు మంగళవారం గాంధీ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కల్హేర్ మండల పరిధిలోని మహదేవ్‌పల్లి గ్రామంలో వంద కుటుంబాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నారాయణఖేడ్ ఎమ్మెల్యే పీ.సంజీవరెడ్డి, మాజీ ఎంపీ, జహీరాబాద్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ సమక్షంలో మంగళవారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సీడీసీ మాజీ చైర్మన్ నర్సింహారెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్ పాల్గొన్నారు. అలాగే గుమ్మడిదల మాజీ సర్పంచ్ ఇందెల సురేందర్‌రెడ్డి ఈనెల 15న నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేరారు. కాగా మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ గూటికి మండల కో ఆప్షన్ సభ్యుడు

పటాన్‌చెరు, ఏప్రిల్ 16: బీఆర్‌ఎస్ అమీన్‌పూర్ మండల మైనార్టీ నాయకుడు, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ.బషీర్‌ఖురేషీ గుడ్‌బై చెప్పారు. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంటా ఉంటున్నారు. రెండు, మూడురోజుల్లో తన అనుచరులతో చర్చించి మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. మంగళవారం బషీర్‌ఖరేషీ విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నాననని చెప్పారు. గతంలో కిష్టారెడ్డిపేట ఉపసర్పచ్‌గా, మండల కో ఆప్షన్ సభ్యుడిగా ఆదరించిన మండల గ్రామ, మండల ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

'ధర్మ పరిపాలన జరగాలి'

జహీరాబాద్, ఏప్రిల్ 16: సమాజంలో ధర్మపాలన జరగాల్సిన అవసరం ఉన్నదని ఎల్లారెడ్డి నియోజకవర్గం మహాదేవ్‌మఠం పీఠాధిపతి మహాదేవస్వామి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో ప్రజల్లో చైతన్యం అత్యవసరమన్నారు. ప్రజల్లో మార్పు వచ్చేంత వరకు పేదోడు పేదోడుగానే మిగిలిపోతాడని ఆయన గుర్తుచేశారు. కొందరు రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల ప్రభావంతో రాజకీయాల్లో కలుషితం ఏర్పడిందన్నారు. తాను కూడా జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నానని, ప్రజలు ఆదరించాలని కోరారు.

వైభవంగా ధ్వజారోహణం

మెదక్ అర్బన్, ఏప్రిల్ 16: మెదక్‌లోని శ్రీ కోదండ రామాలయంలో మంగళవారం ఆలయానికి రక్షణగా ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాష్యం మధుసూదన్‌చార్యుల ఆధ్వర్యంలో మంగళవారం అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, బలిహారణం, అరగింపు, సాయంత్రం, దేవతాకు హాన్వం, మూల మంత్ర హవనం, భేరి పూజ తీర్థ గోష్టి తదితర పూజలు చేపట్టారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు బండ నరేందర్, సభ్యులు బాల్‌రాజ్, పురోషోత్తం, నందిని శ్రీను, బద్రినాథ్, శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, నగరం మల్లేశం, భక్తులు పాల్గొన్నారు.